కథానిక

# "లబ్ధనాశనం"

లక్ష్మీప్రసాద్

"ఆగేస్! ఏటలా దొరనాగ పోతావు?"

"కమాన్. వై అన్..."

"ఊఁ! సిట్టు! సిట్టు!"

ఏటో! అసలా యీల్లకాడ బేరాలాడ్డఁవే తప్పు! ఆడేఁవంటే సిక్కే. ఒక్కపైసా అన్నా ఎక్కువీడు. ఈడెంతిత్తాడో? "ఫూరపోడ"యితే జోరుగానే ఇత్తాడులే.

అయినా ఎంత సేపట్నుంచిగాడీ నాగుతున్నాను. పెద్ద ఎద్దు నాగున్నట్టు—దుక్కిసేసి!

బొమ్మలు జోరుగానే తగలేత్తున్నాడు... అసుర్రగాడిదకొడుకులు "శోయడాన్స్"అని సేతులూపుతూ గ్గెంతులేసి సెరికో రూపాయ...మనకీ బాగానే యిత్తాడులే!

అసలా యీల్లతోటి తమాసా "అస్ బీస్" అని ఏటో రాన్దే పేలాలి...అందుకనే "సిప్పు" దిగిందంటే మనకి బేరం తగిలేసిందే.

"ఏటిసర్! వాంటింగు"

"...... ."

"సోల్జరు పేటకా! బేస్! బేస్!"

ఓర్నీ! ఇప్పుడు ఆ కొసకా మల్లాను! ఈరికి పెల్లాలుంద్రో ఏటో? సోల్జరు పేట "కబ్బే" నాగేత్తాది ఈల్ల పైసా అంతాను.

యీడు తిరిగొచ్చేకాడికి పైసామిగులుత్తాడో! అంతా ఆ . దానికే...

నాకేవు ముందే అడిగేత్తే!... అడిగేత్తేనే మంచిది. అడిగేత్తాను! ఏకేలడిగేత్తే ఆడికి సెదడ తిరిగిందంటే పావల్డబ్బులిచ్చి పేయేస్అంటాడు.. ఆడిబుద్ధి బాగుండాలిగాని డబ్బుల్లేకపోతే ఎం "గడేరమో" "వాచో" పడేత్తాడు... క్రింద టేడాది ఆడిచ్చిన కంట్లాం అమ్మేత్తే ఏడు! ఏడురూపాయలొచ్చింది. మనదుట్టం.

"ఓయ్! సర్! గో...ఇ...ఇయర్...వేస్ట్... ఊఁ!"

"ఓ...కే!"

కంచేపు గాడీలో తొంగోడఁవేమంచిది... ఈడొచ్చేదాకాను...రెండుబుడ్లట్టుకొచ్చేడా... అదంతా పీల్చేత్తేనేకాని బయటికి రాడు.

మ్చ్! ఈల్లకాడ దొరుకుతాదిరా మందూ... బలే బేసయినమందు...ఒక్కసుక్కయితేచాలు. సొరగవేఁవే. యెదవబతుకు, ఎన్నాళ్లు సూసినా బెల్లంసారా తాగే యేడుతున్నాం...ఈమద్దినా అన్నం సారా మరీను...ఛ! దీనెమ్మా...గాటు. నర్రతాగినట్టే.

అసుర్యాలాదొరిచ్చేడు! అది "బేండీ"అంటేని ఏఁరుసి... బుడ్డిలో కొంతంత మిగిల్చి మనకిచ్చేడు. ఆడికి సంచరం పొడుగునా వుత్తినే గాడీ నాగినా సెల్లుతీరదు. ఆడినాగే ఈడూ ఇత్తే ఒకసుక్క..., ఇయ్యాల తేటైనాసరే, యెదవది అక్కులు గాడిదగ్గిర కాటిసారా తాగే రెండు పొద్దులోయింది. "అప్పయ్య"కాడికెల్లాల. దాని కాడ మంచిమందులున్నాదట, సందాల కొండగాడన్నాడు.

రూపాయిదైనా కట్టెయ్యాలియ్యాల, యెదవది రూపాయంటే యేకాడికీ—నాలుగ్లాసులు. ఎదవ "పాహిమిసనో"ల్లొచ్చేకానే... నేకపోతే రూపాయ్కి కుండెడు సారా వచ్చేదికదూ.

యెంతకీ రాడే ఏటస్- నాకు మాసెడ్డ కంగారుగా వున్నాదియ్యాల. హాఁ! ఆడెంతిత్తే అంతా పీల్చేసానే లెక్క. ఒకటో, రెండో అయినా నాగాలీడికాడ.

ఇంతకాడకొచ్చిందెంత...రెండుంపావలా... నాలుగు టియ్యతాగేనా...బేడ దుంపముక్క, అనా బీడీలు...ఇందాకలా అనా సుట్టలు, అనా వడలు, ఇంకా మిగిలింది రూపాయిముప్పాక. దానిసేతులో పెడితే అదేసేత్తాది. సంతబజారు, అంతాను.

"టైఁవెంతయింది బాబూ?"

"తొమ్మిదిరా!"

ఏటీడేసం, సందాల అయిదింటికెక్కేడు. ఇప్పుడు తొమ్మిదేశేరు!...ఆడుగో-వత్తున్నాడు.

నా కొడకా! ఏఁశరీరంరా నీది! ఏటిసెయ్యి నీ పేనాలకి అదురునేదు.

"సర్! లెట్! లెట్!"

"యస్! గో ఆన్!"

ఓరినీ! కళ్ళైలాగున్నాయిరా! అంతా పట్టేసినట్టున్నాడు. నాకే భయమెత్తుందీ!

అంతా ఇచ్చేసేడో! ఏటన్నా మిగిల్చేడో!

ఓరెదవనంజకొడుకైలివిరా! గుప్పెడు సిల్లరయినా దొరుకుతాదనుకున్నాను......ఒక్క రూపాయా! ఛ!

—ఇదేటి రెండునోటేమో!...రంగేటిలాగుంది అయిదునోటు కాదుగదా! అయిదురూపాయలే... సీకట్లో ఇచ్చేసేడేటి సూసుకోకండాను? సూసే ఇచ్చుంటాడులే...ఓరినీ! సాన్సు!

ఇయ్యాల కసితీరా పట్టెయ్యాల. నాలుగు పదులుగాసులే! ఇంటికాడోల్లో — ఏటేడుత్తున్నారో?

పాపం! సింవాగాడు రాత్తిరంతా ఏడుపే... డాట్టరుగోరు ఏదో అరుక్కోనమన్నారు కాలికి, ఇయ్యాలేకంగా గింజలుకొనేత్తాను ఉన్నకాడికి... నేకపోతే రోజూ బేరాలుండటంలేదు...గెంజన్నా ఉండటంలేదు సింవాగాడికి. రోజూ పత్తులే ఉంటే సత్తాడు కూడాను. దానిమట్టుకది జాతరకి కొత్త కోకనిక్కని రాగాలు తీత్తుంది. ఎక్కడికని సవ్వనూ...ముందు దానికి నులకమంచానికి నులక కొనాలి నెలనాటికి.

"యెట్రా! యాలయిందిగాడీ ఇత్తావా?"

"తీసుకో యెస్!"

"యేట్రోయ్! దెబ్బ! రమ్మంటావేటి?"

"పో యెస్!..."

అయాలీడు నాకు మందింపించేడా పాపం .. ఇంకో సుట్టుసాన్సుకి తప్పకండా ఈడికి...మన కేటి రోజూ దొరలే ఎక్కితే...!"

పదిరూపాయలు! దీసెమ్మా సాన్సు! తాగేత్తే ఇట్టే పోతాది— ఆ రూపాయికాడికి మందు కొట్టి...లోటు దానికిత్తాను; ఎగిరి గంతేత్తాది, కోక కొంటాది, నులక కొంటాది సింవాగాడికి అరుకు,...దానికో పూసలదండ...బియ్యం.

అప్పిగాడికి డబ్బులుసిక్కం కావాలని, ఆడికి డబ్బులక్కర్నేదు, డబ్బుల్సిక్కం...సిక్కంకొని రోజూ రెండబ్బులిత్తే ... కొంత పెద్దసిక్కం. అనాది కొంటేనే మంచిది...బేగా నిండిపోతాది నేకపోతే.

"ఏటాదినా ఏది రెండబ్బల్లుంపముక్కెయ్యి!"

"అనాయుచ్చుకోరా! మంచిముక్కలు. జొన్న పొత్తొద్దేటి?"

"వొద్దొదినా, అయ్యేటి నడుం-కాల్లు-ఆడిపోవూ! దీనిపనే బాగుంది...ఇదీ సంపాదిత్తుంది— ఆడూ సంపాదిత్తాడు."

అప్పయ్యకాడ మందున్నాదో నేదో... పెద్దలోటు నాల్చి జేబులోఎటి...సిల్లర పట్టుకుంటాను, నేకపోతే-అంతా వెనకబడతారు.

"అప్పయ్యా! యే టప్పయ్యా..."

"ఏరా అన్నయ్యా సాన్నాల్లకి...ఆడికాడకి ఎల్తున్నావా! ఏఁ—ఇక్కడమా తప్పయ్యదగ్గర కంటే మంచి సరుకు ఈ మొత్తం టవున్లోనే దొరకదరోయ్—నీ పిచ్చిగాని."

"ఒరే తాతా! ఓ పావలాపుల్ల లట్టుకురారా!"

"వద్దప్పయా! ఇయ్యాల నాకాడ డబ్బుల్లేవు. రెండుగాసులే..."

"ఏట్రా! మంచి మందున్నాది...మల్లా రేపేడుత్తె రాదు...పోనీ రేపు మాగేద్దుగాన్లే...

"సోవులూ!" ఆ కోడిపుంజుకాడ కప్పెట్టింది-తెల్లబుడ్డి అదట్రా రా...అంతే కానన్నయ్యా నువ్వా అక్కులుగాడిదగ్గర కెల్లక అది అన్నం కుల్లబెట్టిన కల్లు,...ఆ సారా గుండె తినేత్తాది!"

"ఏరాబావా! చాన్నాల్లకి నీసేలిమందు .."

"వల్లకోయెస్! నాకాడ సిల్లరేవున్నాది... కాంచేపాగు మిగిల్తే ఇత్తాను—"

"బలేసరుకప్పయ్యా!...ఇంకో పావలాపుల్లలు తెమ్మను...ఒరే బాగా కాల్చమన్రోయ్!"

"ఏరాబావా! నేనోగ్లాసు పుచ్చుకుంటాను!"

"పుచ్చుకోరా పుచ్చుకో—ఏడీ! రామినాయుణ్ణికూడా...ఇయ్యాల....మనకి...ఏదప్పయ్యా ఇంకోగ్లాసు నీల్లొద్దే ఎయ్యక!"

"నువ్వా పుచ్చుకో అప్పయ్యా వగ్గాసు!"—

సెరుకుపాకంసెక్కరనాగున్నాది మా సెడ్డగాటు!

"అప్పయ్యా! అప్పయ్యా; ఇంకోటి నువ్వా పుచ్చుకో!"

"ఏ...దీ!...అ...ప్ప...!"

"చూడు సోఁవులూ ఈడిని రిక్సాలో ఎక్కించి పంపెయ్యి...కూడా నువ్వ ఎల్లు లాల్చీ జేబులో డబ్బులుంటాయి రిక్సాకి...తెల్సుకదూ అడి గుడిసి? ఎల్లు"

*   *   *

"ఒలేయ్! కోదండ...ఇలా రాయే!... ఆ నాల్చీలో నోటుంతాది...అదట్రా!"

"..............."

"లేదూ! సూడే..నేకపోతే అదిలా అట్రాయే సెప్తాన"

"ఆయ్యో! ఏటీ మనిసి? ఇనపడదేటి లేదం టేని?"

"పదిరూపాయల్లోటే! సెగునే సూత్తాను!"

"ఒస్సే! తాగు ముచ్చోడికి పదిరూపాయ ల్లోటు నిన్న సందాలనే సూడనేదేటి ఆ నాల్చీ జేబు...ముచ్చవ్వకుంటే-ఆగాడీవోడికిచ్చేను."

"ఓ వూరుకోయే ఎందుకొచ్చిన కబుర్లాడ తావు...తే ఆనోటు-గింజ లట్టుకొత్తాను."

"ఏటి! నీకేం మతోయిందా? తిమ్మిరొాదత్నదా?"

"యేదే... రోజూ యిలా యాడికే ఇత్తున్నావు. దొంగముండా!"

"ఇదిగోరయ్యా... సెయ్య సేసుకున్నావంటే ఓరి నీ జిమ్మడిపోను... నీకేం పోయేగాలంరా. బాబోయ్ నాకు తెల్దురా కుక్కలకొడకా!"

"వల్లకోయే యెదవనంజా! మాటాడితే కిక్కిచ్చేత్తాను."

"ఓలమ్మో! నేనెప్పుడు సచ్చిపోతాన్రో... ఈడెప్పుడు యిరగడైపోతాడే... నన్ను సంపేసేడే... అయ్యెతాగుబోతు చచ్చినాడో!... ఆ యాతముండే నాగేసిందిరో... దీని బుగ్గప్పడెత్తి పోస్తాన్రో...యెల్లినూసుకోరో... అయ్యెనా పదిరూపాయల్లోటో!... నేనెప్పుడు సత్తానురో..."

*   *   *

"ఏరా! గాడీ ఇత్తావా!"

"యాలయిందేట్రా! ఇయ్యాల అద్దెకాడకన్నా రాలేదురా!"

"నిన్న సాన్సులే! కొట్టేసేవు."

"ఏటి సాన్సులేరా!... చుట్టుంటే ఇయ్యి?"

"నాకాడ సుట్టు డదు... బీడీ పుచ్చుకో!"

"యెదవ బీడీ ఆ! ఏదిరా! పోనీ అదే తే?" అబ్బ... కాళ్లు పీకు్కపోతన్నాయి... పొద్దున్నంచీ ఏటీనేదుమరి...ఒకటియ్యి... రెండబ్బుల్లుంపముక్కలు. ఇంకెంతుంది...ఓ గ్లాసుమందు కొట్టి ఎక్కడన్నా తొంగుంటాను...ఇంటికాడ సివాగాడేటిసేత్తున్నాడో! క్యా!"

"ఇయ్యాలెక్కువ తాక్కూడదు. వగ్గాసే! జాగ్రత్తగా వుండాలి! ఒగ్గానె!"

"ఏరా, దొరా! ఎక్కడా దర్సనాలే నేవు-బాగా వట్టేశావే?"

"లేదు బాబయ్యా!... తిండినేకమేఁ యేడుత్తుంటే—"

"తాయ్యకరా బాబూ! కళ్ళంత యెర్రగా వున్నాయి... జోగుతున్నావు కూడాను... ఏది నోరుతెరు."

"లేదు బాబయ్యా!"

"ఏటి డబాయిస్తున్నావు? నోరు వాసనేస్తుంటే...సరేలే మనది మనకిచ్చేయి! నిన్నటిది-ఇవ్వేళటిది!"

"లేదుబాబూ...ఇవ్వాళేస్తలా బేరం నేదు... రేపిత్తాను తప్పకండా!"

"ఎంతరా పావలేకదూ నిన్నటిది ఇవాళ్టిది— ఏదీ జేబు చూడనీ!"

"ఇంకనేం—ఈ అర్ధనా నువ్వుంచుకో బీడీలకి-ఏం-నాది నేను తీసుకుంటాను."

"ఇయ్యాలకదే బాబయ్యా!"

"పోరా పోరా! దొంగముండావాడా!"

ఈ పాపిమిసనోళ్లే నాగేత్తున్నారు - నేను తాగేనేదు అర్ధనా బీడీలా!...అప్పిగాడికి సిక్కంకొంటాను...ఇంటికెళ్ళి ఏమూలో నక్కాలి... నేకపోతే అది ఎన్ని సెప్పినా నమ్మదు. అదొకత్తె యెదవ...అబ్బ కాళ్ళు పీకుతున్నాయి...ఒక్క గాసు మందుంటే ఒగ్గాను...నిన్న పదిరూపాయల్లోటు...పదిరూపాయలు... నాలుగు పదులు గాసులు సాన్సు!-హుఁ! ★